# CLCI BIBLE INSTITUTE

**Christianpet  NIDUBROLU**







**రెవ. డేవిడ్ కీని**

*Rev. David Koenig*

# దేవుడు పరిపాలించువాడు

## GOD RULES

### పరిచయం Introduction

ఏలియా కర్మేలు పర్వతంపై బయలు ప్రవక్తలపై పోటీచేసినప్పుడు వారిని వారి దేవుడిని ఏలియా అపహాస్యం చేసినాడు. వారిదేవుని యొద్దనుండి ఎటువంటి సమాధానం రాలేదు. "బహుశా వారిదేవుడు ధ్యానము చేస్తుండవచ్చు లేదా దూరమున ఉండవచ్చు లేదా ప్రయాణము చేయుచుండవచ్చు లేదా నిద్రపోవుచుండవచ్చు మరియు ఆ నిద్రనుండి లేపవలసిరావచ్చు." అయితే మనదేవుని గురించి మనము అటువంటివి అనలేము. కాని ఒక్కొక్కసారి క్రైస్తవులు వారి బలహీనతలలో "ఇదంతా దేవుడు నాకు ఎందుకు పెట్టాడు, నాకే ఎందుకు జరుగుచున్నది" అని అవేదన చెందుచూ ఉంటారు. మన దేవుడు సర్వజ్ఞాని అని సర్వశక్తిమంతుడుఅని తెలిసికూడా "దేవుడు నాపని ఎప్పుడు చేస్తాడు నేను ఇంకా ఎంతకాలం ఎదురు చూడాలి" అని మన మనస్సులలో వాపోతూఉంటాము. ఒక్కొసారి వివిధ ప్రయోజనాలకోసము దేవునిపని మరియు సాతాను పని ఒకే సమయంలో కొనసాగుతూఉంటాయి కాని భిన్నంగా ముగుస్తాయి. యోబు విషయం గురించి ఆలోచించండి.

ఈ అధ్యాయంలో దేవుడు అన్నింటిమీదా ఏలా పరిపాలన చేస్తున్నాడో మరియు ఆయన దృష్టినుండి ఏదికూడా తప్పించుకోలేదు మొదలగు విషయాలు ధ్యానించబోవుచున్నాము. ఆయన నేత్రాలు భూమియందంతటా సంచారము చేస్తుంటాయి. మరియు ఆయన తన చిత్తానుసారం పనిచేస్తుంటాడు. ఆయన కార్యాలు మన జ్ఞానమునకు అందనివి. కాని మానవులయెడల దేవునికున్న ప్రేమ మనకు తెలుసు. దేవుడు తన సంఘముపైఉన్న ప్రేమతోనే ఈ ప్రపంచాన్ని ఏలుచున్నాడు. "ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళ లోక ద్వారములు దాని యెదుట నిలువనేరవు." మత్తయి 16:18. దేవుడు తన చిత్తప్రకారం ఈ ప్రపంచాన్ని పరిపాలించే విధానంలో ఆయన దేవదూతలను ఏవిధంగా ఉపయోగించుకుంటాడో అనే విషయాన్ని మనం పరిగణలోనికి తీసుకోవడం లేదు. కాని మనకు కనిపించకపోయినా ఈవిషయంలో దేవదూతల ప్రమేయం బాగా ఉండవచ్చు. దేవుడు తనయొక్క కృపారాజ్య విస్తరణ విషయంలో తన అనుచరులను ఏవిధంగా ఉపయోగించుకుంటున్నాడో అనే విషయాన్ని కూడా మనం పరిగణలోనికి తీసుకోవడంలేదు. ఇటువంటి దేవునిపరిపాలనను మనం ఒక్కసారి పూర్తిగా అవలోకనం చేసుకుంటే ఆయన తనపాలనద్వారా మనలను ఓదార్చు తీరునుబట్టి మరియు ఆయన మనకు ఇస్తున్న ప్రోత్సాహమును బట్టి ఆయన పరిపాలన ఈ ప్రపంచంపై కాదుకాని ఈ ప్రపంచంలో ఉన్న మన మీద అని అర్ధం చేసుకోవాలి.

### కీర్తనలు Psalms



మన దేవుడు అసంతుష్టుడు కాదు మరియు సుదూరాన ఉండువాడు కాదు. ఏదో ఒకసారి ప్రతీది సృష్టించి అన్నిటిని ప్రారంభించి ఆ తరువాత ఎక్కడికో వెళ్ళిపోయి, తాను సృష్టించిన వాటిని పట్టించుకోకుండా మరియు వాటిని పరిపాలించకుండ వదిలివేసే దేవుడు కాడు మన దేవుడు. ఆయన కొండలను లోయలను మాత్రమే కాక సమస్తమును పరిపాలించు దేవుడైయున్నాడు. ఆయన దూరమున ఉండువాడుకాక సమీపమునఉండు దేవుడు. ఆయనకు మనతలవెంట్రుకల లెక్క తెలుసు మరియు ఒక పిచ్చుక పడుట తెలుసు. ఈ భూమిమీద మనమున్న స్థానం ప్రకారం మనకున్న జ్ఞానం కంటే పరలోకంలోఉండే ఆదేవునికి మనలను గమనించుటకు పూర్తిగా భిన్నమైన కోణంఉంది.

దేవుడు ఎవరో ఆయనలో ఎన్ని భిన్నమైన కోణాలు ఉన్నాయో దాని గురించి పాతనిబంధన కీర్తనల పుస్తకం ఎంతో శక్తివంతంగా బోధిస్తూ ఉన్నది. తన చిత్తమునకు వ్యతిరేకముగా నిలబడలేని భూరాజులు మరియు ఏలికలయొక్క ప్రణాళికలను మరియు వారి ఆలోచనలనుచూచి ఆకాశము నందు ఆసీనుడగు ప్రభువు నవ్వుచున్నాడు మరియు వారిని చూచి అపహసించుచున్నాడు. పరలోకము నుండి ఆయన ఉరుముచున్నాడు మరియు వారికి అనుగుణంగా తీర్పులు పడుచున్నాయి. పరలోకమునుండి ఆయన మహిమా ప్రభావము సర్వ లోకముపై కనబడుచున్నది.

పరలోకము నుండి పరిపాలించుచున్నవానిని చూచి ఈలోక రాజ్యములన్నియు మరియు రాజులందరు దేవునిగూర్చి పాడి కీర్తించవలసి యున్నది. ఆకాశమునందు సింహాసనాసీనుడగువాడు అందరికంటే ఎంతో ఎత్తుగాఉండి, సమస్తదేశములను గమనించుచు వాటికి అనుగుణంగా తన పాలన కొనసాగించుచున్నాడు. ఆకాశమందున్న మనదేవుడు తన కిచ్చవచ్చినట్లుగా సమస్తమును ఆయన చేయు చున్నాడు. పరలోకంలో సింహాసనాన్ని అధిష్టించిన మనదేవుడు సమస్తమును తెలుసుకుంటూ దేనిని మర్చిపోకుండా తనబిడ్డల మరియు తనవారసుల అత్యుత్తమ ప్రయోజనాలు అనుసరించి వారికి శాశ్వత జీవితాన్నిఇచ్చు ఇటువంటి దేవుడు మరెక్కడైనా కలడా! అహా ఎంత అద్భుతమైన దేవుడు మనకున్నాడు. (కీర్తనలు 2:4, 18:13, 57:5, 68:33, 103:19, 113:4, 115:3, 123:1)

## యెషయా Isaiah



సుదీర్ఘంగా నమోదు చేయబడిన ప్రవక్తలగ్రంధాలలో ఆయన పరిపాలన గూర్చి చెప్పడానికి చాలా విషయాలు ఉన్నాయి. దేవుడు ఏ విధంగా తనపరిపాలనను అనేకదేశాల మధ్య ముఖ్యంగా క్రింది పది దేశాలలో అమలు పరచినాడో యెషయా ప్రవక్త తనగ్రంధంలోచారిత్రక దృక్పధంతో వ్రాసియున్నాడు. యెషయాగ్రంధం యెషయాసువార్తగా పిలువబడింది. కారణం రాజు కృపతో కూడిన తన రాజ్యపరిపాలనలో తనప్రజల మధ్య ప్రవక్తద్వారా రక్షణను గూర్చి ప్రకటించిన శుభసందేశాలు అనేకం ఈ గ్రంధంలో ఉన్నాయి. దేవుని రక్షణ అను సువార్త ఎంతో లోతుగాను మరియుసమృద్ధిగాను ఇందులోఉన్నది. దేవునిచిత్తమునకు వ్యతిరేకంగా అడ్డుకట్టవేయు అనేక రాజ్యాల నేపధ్యంలో దేవుడు పరిపాలన ఏలాగు కొనసాగించాడో ఈ గ్రంధంలో వ్రాయబడింది. కాలం సంపూర్ణమైనప్పుడు మెస్సీయా తీసుకురాబడి దేవుని ప్రజలు ఆయన ద్వారా ఏలాగు సంరక్షించబడుదురో ఇందులో చక్కగా వ్రాయబడిఉంది.

* బబులోను - యెషయా 13:1-14:23 - సొదమ మరియు గొమొఱ్ఱా వలే భయంరకమైన నాశనము ఉంటుంది. నక్కలను వేటాడమే ఒక ప్రపంచ వింతగా మారుతుంది.

* అష్షూరు - 14:24-27 - అష్షూరువారు ఎంత భయంకరులైనా ఎంత దూకుడు కలవారైనా దేవుని ఉద్దేశ్యం వారికి వ్యతిరేకంగా నిలిచింది. యోనా కాలములో అష్షూరు రాజధాని నినెవె పశ్చాత్తపపడినా తరువాత నహూము కాలములో వారు తిరిగి తమపూర్వ పద్ధతులలోనికి వెళ్ళిపోయి దేవుని ఉగ్రతను చవిచూచిరి.

* ఫిలిష్తియా - 14:29-32 - న్యాయాధిపతుల కాలములోను మరియు ఏకరాజ్యకాలములో బాగుగా తెలిసిన దేవునిప్రజల పురాతన శత్రువు. అయితే దేవుడు ఓటమిని పంపగా దేవునిముందు నిస్సహాయమైపోయింది.

* మోయాబు - 15-16 - మోయాబు దేవతలు విఫలమైపోయి ప్రజలు వినాశనమునకుగురై రోదన మరియు దు:ఖము వారిని అధిగమించినది.

* దమస్కు - (అరాము) - 17:1-3 వారు నిలువునా నరకబడి శిధిలాల కుప్పగా మార్చబడుదురు.

* కూషు (ఇధియోపియా) 18:1-3 - వారు దేవునికి లోబడి ఉంటారు. దేవుడు వారిని పెంచి తరువాత తక్కువచేయును.

* ఐగుప్తు - 19-20 - ఐగుప్తుఅనగానే మనకు యోసేపు కాలం గుర్తుకు వస్తుంది. మరియు ఐగుప్తుపై దేవుని సంపూర్ణ అధికారం మరియు పరిపాలన జ్ఞాపకం చేసుకొండి తరువాత మోషేతో 400 సంవత్సరాల చరిత్ర గుర్తుచేయబడుతుంది. ఈ శక్తివంతమైన సామ్రాజ్యం విచారకరంగా మారి అర్థిక తిరోగమనానికి గురై తరువాత పైనిక ఓటమికి ఎదుర్కొన్నది. దేవుడు ఒక దేశాన్ని జయించుటకు వేరొక దేశాన్ని ఉపయోగించాడు. ఐగుప్తుకు వ్యతిరేకంగా అష్షూరును ఉపయోగించాడు. దేవుడు సమస్త దేశాధిపతి.

* ఏదోము - 21:11-12 యాకోబును క్షమించిన ఏశావు ద్వారా ఈ దేశం స్థాపించబడింది. తరువాత దేవుని ప్రజలకు శత్రువై భయంకరమైన వినాశనాన్ని పొందింది.

* అరేబియా - 21:13-17 - నిజదేవుని వ్యతిరేకించిన మిగతా దేశాలకు మాదిరిగానే ఈ దేశపు కీర్తి కూడా ముగిసిపోయింది.

* తూరు - 23 - ఒక దేశం వాణిజ్యపరంగాను సైనికపరంగాను ఎంత శక్తివంతమైనదైనా ప్రభువులేనట్లైనా అది జయింపబడుతుంది మరియు నాశనము చేయబడుతుంది. దానికి ఉదాహరణ తూరు. దేవుడు తన పాలనతో అలసిపోడు మరియు వృద్ధుడైపోడు. కోరేషు విషయమై యెషయా ప్రవచనాలు ఖచ్చితమైనవి. 44:28, 45:1. దానియేలు దినముల యొక్క చివరి సన్నివేశానికి ముందు షుమారుగా 100 సంవత్సరాలకు ఆతను కనిపిస్తాడు. ఒక అవిశ్వాసియైన కోరేషును దేవుడు వాడుకొని తన ప్రజలకు చెరనుండి విడుదల కలిగించాడు. దేవుడు పరిపాలించువాడు.

## దానియేలు Daniel



దేవుని ఎరుగని భూరాజులను దేవుడు ఎలాగు ఏలాడో సవివరంగా ఉదహరించిన పుస్తకం ఏదైనా ఉన్నదంటే అది దానియేలు గ్రంథం అవుతుంది. దానియేలు 2:31-35లో నెబుకద్నెజరు స్వప్నం ఉంది మరియు 7:1-7లో నాలుగు మృగములు గురించి వ్రాయబడింది. బబులోను, పారశీక, గ్రీకు మరియు రోమా సామ్రాజ్యాలు ఈ నాలుగు మృగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నవి. దేవుడు తన ఉద్దేశ్యం నెరవేర్చుకొనుటకు వాటిని వాడుకొని తన మూలంగా ఈ సామ్రాజ్యాలను ఉనికి లోనికి తెచ్చాడు. 2:35లో సర్వభూతలమంత మహా పర్వతం గురించి వ్రాయబడింది. సమస్త భూలోక రాజ్యలను దేవుడు కొట్టివేయుటలో సఫలమై ఆ తరువాత స్థాపించబడిన దేవుని రాజ్యమే ఈ సర్వ భూతలమంతా మహా పర్వతంగా పోల్చబడింది.



దేవుని ఎరుగని ఒక అన్యరాజు సర్వలోక రాజుగురించిన చెప్పిన సాక్ష్యంవినండి. 4:34-35 "ఆకాలము గడచిన పిమ్మట నెబుకద్నెజరను నేను మానవబుద్ధి గలవాడనై నా కండ్లు ఆకాశము తట్టుఎత్తి, చిరంజీవియుసర్వోన్నతుడునగు దేవునికి స్తోత్రము చేసి ఘనపరచి స్తుతించితిని. ఆయన ఆధిపత్యము చిరకాలము వరకు ఆయన రాజ్యము తర తరములకు నున్నవి. భూనివాసులందరు ఆయన దృష్టికి ఎన్నికకు రానివారు. ఆయన పరలోకసేన యెడలను భూనివాసుల యెడలను తన చిత్తము చొప్పున జరిగించువాడు, ఆయన చేయి పట్టుకొని నీవేమి చేయుచున్నావని ఆయనతో చెప్పుటకు ఎవడును సమర్థుడు కాడు." మితిమీరిన గర్వముతో ఉన్న ఒక రాజు అరణ్యములో గడ్డిమేయు పశువుగా మార్చబడి తరువాత తన యధాస్థితికి పునరుద్ధరించబడిన తరువాత ఉత్తేజితుడై ఆ రాజు పైవిధంగా పలికాడు.



అవిశ్వాసిగా ఉన్న మరియొక రాజు ప్రభువును తెలిసికొని పలికిన మరియొక సాక్ష్యాన్ని చూద్దాం. 6:25-27 "అప్పుడు రాజగు దర్యావేషు లోకమంతటనివసించు సకలజనులకును రాష్ట్రములకును ఆయా భాషలు మాటలాడువారికిని ఈలాగు వ్రాయించెను. మీకు క్షేమాభి వృద్ధి కలుగునుగాక. నా సముఖమున నియమించిన దేమనగా నా రాజ్యములోని సకల ప్రభుత్వముల యందుండు నివాసులు దానియేలుయొక్క దేవునికి భయపడుచు ఆయన సముఖమున వణకుచుండవలెను. ఆయనే జీవముగల దేవుడు, ఆయనే యుగ యుగములుండువాడు, ఆయన రాజ్యము నాశనము కానేరదు, ఆయన ఆధిపత్యము తుదమట్టునకుండును. ఆయన విడిపించువాడునురక్షించువాడునైయుండి, పరమందును భూమిమీదను సూచకక్రియలను ఆశ్చర్యకార్యములను చేయువాడు. ఆయనే సింహముల నోటనుండి ఈ దానియేలును రక్షించెను."

దానియేలు కాలములోని మరియొక రాజు వృత్తాంతములో గోడ మీద చేతి వ్రాతతో ఇవ్వబడిన హెచ్చరిక ద్వారా ఏర్పడిన దుర్భర పరిస్థితులను మార్చుటకు ఎవరివల్ల సాధ్యంకాలేదు.

ఈ హెచ్చరిక తెలుపబడిన ఆ రాత్రే ఆయన వధింపబడినాడు. 5వ అధ్యాయము. తనకు ఎంత ప్రతిఘటనఉన్నా దేవుడు ప్రత్యక్షంగా మనుష్యుల వ్యవహారాలలో ఏరీతిగా జోక్యం చేసుకుంటాడో మరియు తన దైవికమైన చిత్తమును ఎలా కొనసాగించాడో ఇక్కడ మనం చూడగలం.

## రెండు కత్తులు The Two Swords

మార్టిన్ లూథర్ సంస్కరణలద్వారా "రెండు కత్తుల" బోధ తిరిగి దేవుని సంఘములో పునరుద్ధరించబడినది. దేవుని పాలనను త్రోసి వేయుట సాధ్యంకాదు. సంఘములోను మరియు ప్రాపంచిక వ్యవహారాలలోను దేవునికి మానవునికి మధ్య పోపుయొక్క పాపసీని మరియు ఆజ్ఞలు ఉంచడమనేది అంత్య క్రీస్తుయొక్క అత్మ స్తుతి మరియు ధైర్యం కనబడుచున్నది. దేవుని వాక్యం మరియు ఆత్మ ద్వారా మాత్రమే దేవుడు తన ప్రజలను పరిపాలిస్తాడు అనే వాక్య సత్యం తిరిగి పునరుద్ధరించబడినది. సమస్త విశ్వాసుల సార్వత్రిక యాజకత్వం అనగా మనలో ప్రతిఒక్కరు మధ్యవర్తియైన యేసుద్వారా దేవుని దగ్గరకు ఉచిత ప్రవేశం కలిగిఉన్నారు తప్ప ఏమానవుని ద్వారా మనం దేవుని సమీపించలేము. దేవుని వాక్యమనే ఆత్మఖడ్గంతో దేవుడు తన కృపారాజ్యాన్ని మరియు తన సంఘమును నిర్వహిస్తున్నాడు. ఎఫెస్సీ 6:17, హెబ్రీ 4:12. మరియు ఇంకొక "ఖడ్గం" ఉన్నది. దేవుడు సమస్త ప్రపంచంలో తన అధికారంలోఉన్న తన రాజ్యాన్ని పరిపాలించుటకు ఏ మానవ లేదా సంస్థమీద ఆధారపడలేదు. ఏ ప్రాంత అధికారులైనా మరియు ఏ వయస్సువారైనా దేవునియొక్క కార్యాచరణకు మరియు ఆయనయొక్క చిత్తానికి లోబడియుండవలసియున్నది. తొలగించుట మరియు నియమించుట అనునది కేవలము తన ప్రణాళికనుబట్టేకాని ఏ మానవునిపై ఆధారపడిలేదు. రోమా 13:1-4 "ప్రతివాడును పైఅధికారులకు లోబడి యుండవలెను, ఏలయనగా దేవునివలన కలిగినది తప్ప మరి ఏఅధికారమును లేదు. ఉన్న అధికారములు దేవునివలననే నియమింప బడియున్నవి. కాబట్టి అధికారమును ఎదిరించువాడు దేవుని నియమమును ఎదిరించుచున్నాడు. తమమీదికి తామే శిక్ష తెచ్చుకొందురు. ప్రభుత్వము చేయువారు చెడ్డకార్యములకేగాని మంచి కార్యములకు భయంకరులుకారు. నీకు మేలు కలుగుటకు అధికారులు దేవుని పరిచారకులు, వారికి భయపడక ఉండకోరితివా, మేలుచేయుము. అప్పుడు వారిచేత మెప్పు పొందుదువు. నీవు చెడు చేసిన యెడల భయపడుము, వారు ఊరకయే ఖడ్గము ధరింపరు. కీడుచేయువాని మీద ఆగ్రహము చూపుటకై వారు ప్రతీకారము చేయు దేవుని పరిచారకులు."



హిందు, ముస్లిం లేదా భౌద్ధ మొదలగ ఇతర అన్యమతాలకు చెందిన పాలకఅధికారులు ఉంటే అది పెద్దవిషయంకాదు. దేవుడు వారి మీద కూడా తన పరిపాలన కొనసాగిస్తున్నాడు. ఆయన తన ప్రయోజనాలను సాధించాడు. అపోస్తలుడైన పౌలు ఇది వ్రాసిన సమయం నుండి పరిశీలన చేస్తే రోమా సామ్రాజ్యపాలక అధికారులు, కాన్స్టాంటైన్ అనుక్రైస్తవుడు రోమాచక్రవర్తి అయ్యేంతవరకు క్రైస్తవ ప్రపంచం మీద మొత్తం పదిసార్లు భయంకరమైన వేధింపులతో కూడిన హింస జరిపారు. ఈ దాడులలో కొన్ని రోమా సామ్రాజ్యవ్యాప్తంగా ఉండగా మరి కొన్ని రోమా సామ్రాజ్యంలోని ముఖ్యక్రైస్తవ ప్రాంతాలలో కేంద్రీకృతమైయున్నవి. అయినా దేవుడు తనసంఘమును అసక్తితో ఇంకా పరిపాలిస్తూనే ఉన్నాడు. దేవుని పూర్తి చిత్తమేమైయున్నదో మనకు తెలియకపోయినాగాని, ఇంత భయంకరమైన హింసలలో కూడా ఆయన తన సంఘమును అభివృద్ధి పరచి చివరకు ఓక్రైస్తవ చక్రవర్తిని దేవుడు ఏర్పాటుచేసి క్రైస్తవులపై రేగిన దారుణ హింసకు దేవుడు ముగింపుపలికాడు. "ఆహా, దేవుని బుద్ధిజ్ఞానముల బాహుళ్యములు ఎంతో గంభీరములు, ఆయనతీర్పులు శోధింపనెంతో అశక్యములు, ఆయన మార్గములెంతో అగమ్యములు. ప్రభువు మనస్సును ఎరిగినవాడెవడు? ఆయనకు ఆలోచన చెప్పినవాడెవడు?" రోమా 11:33-34.

పౌలుయొక్క మాటలనుతిరిగి పేతురు భక్తుడు తనమొదటి పత్రికలో ప్రతిబింబిస్తున్నాడు. "మనుష్యులు నియమించు ప్రతి కట్టడకును ప్రభువు నిమిత్తమై లోబడియుండుడి. రాజు అందరికిని అధిపతియనియు, నాయకులు దుర్మార్గులకు ప్రతిదండన చేయుటకును సన్మార్గులకు మెప్పుకలుగుటకును రాజువలన పంపబడినవారనియు వారికి లోబడియుండుడి." 1 పేతురు 2:13-17. పౌలు మరియు పేతురుకూడా రోమా అధికారులచే విధింపబడిన మరణదండనకు లోబడినారని సంప్రదాయ పుస్తకాలు చెప్పుచున్నాయి. ఆ భక్తులకు దేవుడిచ్చిన కృపాకాలము ఈ భూమి మీద వారు చేయవలసిన సేవ ముగించబడినాయి అందువలననే క్రీస్తులోని ధన్యకరమైన మరణమను వరం వారికి లభించింది.

## సంఘముపై దేవునికున్న ఆసక్తినిబట్టి ఆయన పరిపాలిస్తాడు God Rules in the Interest of His Church

మనకున్న పౌలుయొక్క పదమూడు పత్రికలనుబట్టి, మరియు అపోస్తలులకార్యగ్రంథములోని 13-28 అధ్యాయాలలోని ఆధారాలను బట్టి చూస్తే పౌలు తన జతపని వారితో కలసి నిర్వహించిన పరిచర్య ఈ భాగాలలో ఎక్కువగా కనబడుతుంది. దీనిని బట్టి మనం గమనించగలిగిందేమంటే, దేవుడు పౌలు మరియి పౌలుయొక్క జతపనివారిద్వారా జరిగించిన పరిచర్యనుబట్టి ఆయన తనసంఘమును ఎంతో ఆసక్తితో పరిపాలించుచున్నాడనేది తెలుస్తున్నది. అంతేకాకుండా అవిశ్వాసులమధ్య దేవుడు ఎంత ఆసక్తిగల్గి తన సంఘమును నిర్వహిస్తూ విస్తరిస్తున్నాడో ఈ భాగాలలో వ్యక్తిగతంగా మనం చూడగలం. ఇక్కడ ప్రాముఖ్యంగా మూడు పేర్లు గుర్తుంచుకోవాలి. అవి **గల్లియోను**, **లూసియ** మరియు **యూలి**. ఈ ముగ్గురిలో ఎవరుకూడా విశ్వాసులుకారు. వీరందరుకూడా ఆదినాలలో అమలులో ఉన్న రోమా సామ్రాజ్యంలో ఘనమైన అధికారులు. రోమా పరిపాలకులు ఆజ్ఞాపించిన ఆజ్ఞలను ఖచ్చితముగా అమలుచేయుటకు కట్టుబడిన అధికారులు వీరు. కాని ఈ ముగ్గురిమీద మరియు అ ముగ్గురిద్వారా దేవుడు తన అధికారాన్ని చూపి, పౌలుకు సహాయంచేయించి తన పాలనను కొనసాగించాడు. పౌలుతో సంబంధంఉన్న ఈ ముగ్గురు వ్యక్తుల జీవితాలను మనం పరిశీలనగా చూస్తే దేవుడు ఎటువంటి మార్పులేని వాడని మనం గుర్తుంచుకోవాలి. పాతనిబంధనకాలంలో దేవుడు ఏలాగు తన కార్యకలాపాలను నిర్వహించాడో అదేవిధంగా క్రొత్తనిబంధన కాలంలో కూడా అదే రీతిగా ఆయన తన కార్యకలాపాలను నిర్వహించుచున్నాడు. లేఖనభాగాలలో నమోదు చేయబడినట్లుగా ఆయన తన కార్యకలాపాలను నిర్వహించాడు అదేవిధంగా ఈరోజుల్లో మన మధ్య చివరి దినం వరకు ఆయన తన కార్యకలాపాలను నిర్వహిస్తాడు.



పౌలు తనయొక్క రెండవ సువార్త దండయాత్రలో పద్దెనిమిది నెలల సుదీర్ఘ కాలం కొరింధి పట్టణంలో గడిపాడు. ఆపట్టణంలో పౌలు కొరకు గొప్ప పరిచర్యఉన్నదని, అనేకులు విశ్వాసులుగా మార్చబడతారని దేవుడు పౌలుకు వాగ్దానమిచ్చాడు. పౌలుకు వ్యతిరేకంగా ద్వేషం మరియు అసూయ యూదుల రూపంలో కూడుకోవటం ప్రారంభించాయి. రోమా అధికారులను ఒప్పించి తమకు ఇబ్బందికరంగా ఉన్న పౌలు యొక్క పోరాటాన్ని ఆపివేయగలమని యూదులు అనుకొన్నారు. "గల్లియోను అకయకు అధిపతిగా ఉన్నప్పుడు యూదులు ఏకీభవించి పౌలుమీదికి లేచి న్యాయ పీఠము ఎదుటకు అతనిని తీసికొనివచ్చి వీడు ధర్మశాస్త్రమునకు వ్యతిరేకముగా దేవుని ఆరాధించుటకు జనులను ప్రేరేపించుచున్నాడని చెప్పిరి. పౌలు నోరుతెరచి మాటలాడబోగా గల్లియోను యూదులారా, యిదియొక అన్యాయముగాని చెడ్డనేరము గాని యైన యెడల నేను మీమాట సహనముగా వినుట న్యాయమే ఇదియొక ఉపదేశమును, పేళ్ళను, మీ ధర్మశాస్త్రమును గూర్చిన వాదమైతే మీరే దాని చూచు కొనుడి, ఈలాటి సంగతులను గూర్చి విమర్శ చేయుటకు నాకు మనస్సు లేదని యూదులతో చెప్పి వారిని న్యాయపీఠము ఎదుటనుండి తోలివేసెను. అప్పుడందరు సమాజమందిరపు అధికారియైన సోస్తెనేసును పట్టుకొని న్యాయపీఠము ఎదుట కొట్టసాగిరి. అయితే గల్లియోను వీటిలో ఏసంగతిగూర్చియు లక్ష్యపెట్టలేదు." అ.కా 18:12-17. పౌలు స్వేఛ్ఛాపూరిత వాతావరణంలో ప్రయాణించి ఇంకా దేవుని కొరకు అత్యంతకృషి చేయాల్సి ఉన్నది కనుక పౌలుకు ఎటువంటి ఆటంకాలు రాకుండా దేవుడు గల్లియోను ద్వారా చేశాడు. గల్లియోను రోమా చక్రవర్తి యొక్క నమ్మినబంటుగా ఉన్నాడు మరియు గల్లియోను క్రీస్తు విశ్వాసిఅని ఎక్కడా ఎటువంటి ఆధారములేదు. గల్లియోనుకుజరుగుచున్నది ఏమి తెలియకపోయినా గల్లియోను దేవుని చేతిలో వాడబడినాడు తద్వారా పౌలు ఆపదనుండి తప్పింపబడినాడు మరియు దేవుని రాజ్యసువార్త వ్యాప్తిలో పౌలు తన మూడవ సువార్తదండ యాత్ర కొరకు క్షేమంగా దాటి ముందుకు కొనసాగుటకు గల్లియోను ద్వారా దేవుడు దారి ఏర్పాటు చేశాడు.



పౌలును యెరూషలేముకు తీసుకొని వెళ్ళకుండా నిరోధించుటకు యాకోబు వేసిన ప్రణాళిక విఫలమైనది. కారణం వ్యతిరేకత తీవ్రంగా ఉంది. కాని పరిపాలించు మన దేవుడు ఆ వ్యతిరేకత కన్నా ఇంకా బలమైన వాడు. మేము పౌలును చంపు వరకు అన్న పానములు ఏమియు రుచి చూడమని ఒట్టు పెట్టుకొని కుట్రచేసి కట్టుకట్టిన నలభైమంది యూదుల ఘోరమైన దాడిని ఎదుర్కొనుటకు పౌలు సన్హెడ్రిన్ సభముందుకు తీసుకొనిరాబడినాడు. అ.కా 23:14. వారు ఎంతో శక్తివంతమైన ఆకలితోఉన్నారు. పౌలు యొక్క మేనల్లుని ద్వారా ఈ విషయం సహస్రాధిపతియైన లూసియకు తెలుపబడినది. వెంటనే లూసియ ద్వారా ఇద్దరు శతాధిపతులకు ఈ క్రింది ఆదేశాలు జారీచేయడినవి. "తరువాత అతడు శతాధి పతులలో ఇద్దరిని తన యొద్దకు పిలిచి కైసరియవరకు వెళ్ళుటకు రెండువందల మంది

సైనికులను డెబ్బదిమంది గుఱ్ఱపు రౌతులను రెండువందలమంది ఈటెలవారిని రాత్రి తొమ్మిది గంటలకు సిద్ధపరచి పౌలును ఎక్కించి అధిపతియైన ఫేలిక్సునొద్దకు భద్రముగా తీసికొని పోవుటకు గుఱ్ఱములను సిద్ధపరచుడని చెప్పెను. అ.కా 23:23-24. దేవునిఎరుగని అన్యుడైన లూసియ దేవుని ఆజ్ఞలనుకాక రోమా ప్రభుత్వ ఆజ్ఞలనుసమర్ధవంతంగా అమలుపరచేటువంటి పనివాడు. కాని లూసియ పనులలో దేవుని అద్భుత అదృశ్య హస్తం మనం చూడగలం. లూసియ విశ్వాసికాడుకాని రోమాప్రభుత్వ సమ్మకమైన సేవకుడు. తనకు తెలియకుండానే దేవుడు కోరుకొన్నది లూసియ చేస్తున్నాడు. కుట్రచేసిన ప్రతి యూదునికి ప్రతిగా దేవుడు దాదాపు పన్నెండుమంది రోమ్ సైనికులను దేవుడు ఏర్పాటుచేసి పౌలును భద్రపరచినాడు. ఒక్కొక్కసారి బాగా ఆకలితో ఉన్నవారికి కొరకడానికి ఒక్కముద్ద ఆహారం కూడా దొరకదు. ఈవిషయంలో యూదులు పౌలును కొరకడానికి ప్రయత్నించారు కాని పౌలు రోమా సైనికులమధ్య గుఱ్ఱంమీద తనను హతంచేయుటకు ప్రయత్నించిన యూదులనుండి దూరంగా వెళ్తున్నాడు. ఇంకాదేవుని పనిచేయుటకు మరి ముఖ్యంగా రోమాలో దేవుని కొరకు సాక్షిగా ఎక్కువగా పని చేయుటకు దేవుడు పౌలుకు తన అద్భుతమైన కృపనిచ్చాడు. కైసరియలో పౌలు ఖైదు చేయబడిన సమయంలో కూడా పౌలు దేవునికి సాక్షిగా పనిచేశాడు. ఆ ఖైదు సమయంలోనే రాజైన అగ్రిప్పకు మరియు రోమా గవర్నర్లుగా ఉన్న ఫేలిక్సునకు మరియు పోర్కియు ఫేస్తునకును దేవుని గూర్చిన సాక్ష్యాన్ని పౌలు నిపించాడు.



తదుపరి పౌలును మిగతా ఖైదీల కూడా నౌకలో రోమా పంపించుటకు ప్రయాణం సిద్ధంచేశారు. రోమా పంపించబడుతున్న ఈ ఖైదీల బృందానికి రక్షణగా వెళుతున్న రోమా సైనిక బృందానికి నాయకత్వ బాధ్యత వహించింది శతాధిపతియైన యూలి. ఇతడు పౌలుయెడల ఎంతో దయ చూపించాడు. మనం అనుకున్నదానికంటే ఈ కథలో ఇంకా ఎంతోఉంది. ఒక అనామకుడైన యూలిలాంటి వారినితన పరిచర్యలో పనిముట్లుగా వాడుకొనుటకు దేవుడు జోక్యం చేసుకుంటున్నాడు. మార్గమధ్యంలో ఒక భయంకరమైన తూఫాను చెలరేగి తప్పనిసరిగా ఓడ ధ్వంసమయ్యే పరిస్థితి సంభవించినది. "ఖైదీలలో ఎవడును ఈదుకొని పారిపోకుండునట్లు వారిని చంపవలెనని సైనికులకు ఆచోచన పుట్టెనుగాని శతాధిపతి పౌలును రక్షింప నుద్దేశించి వారి ఆలోచన కొనసాగనీయ్యక, మొదట ఈదగలవారు సముద్రంలో దుమికి దరికి పోవలెననియు కడమవారిలో కొందరుపలకలమీదను, కొందరు ఓడ చెక్కల మీదను, పోవలెననియు ఆజ్ఞాపించెను. ఈలాగు అందరు తప్పించుకొని దరి చేరిరి." అ.కా 27:42-44. ఇక్కడ మరల రోమా అధికారియైన శతాధిపతి యూలిని ఒక పరికరంగా వాడుకొనుటకు దేవుని ప్రణాళిక నిర్వహించబడినది రెండు సంవత్సరాల రోమా గృహనిర్భంధంలో ఉన్నప్పుడు పౌలు చేయవలసిన దేవుని పరిచర్య ఇంకా ఉన్నది గనుక దేవుడు అద్భుతంగా పౌలును రక్షించాడు. ఈగృహ నిర్భందం తరువాత పౌలు విడుదలైన పిమ్మట దేవుని కొరకు ఇంకా మరింత పౌలు పనిచేయ వలసియున్నది. రెండవసారి పౌలు ఖైదియైనప్పుడు మాత్రమే ఆయన పని ముగించబడి దేవుని పిలుపుమేరకు ఈలోక యాత్ర చాలించి పరమ గృహమునకు వెళ్ళినాడు.

## ఇంకా ముందుకు వెళ్తున్న నలుగురు గుఱ్ఱపు రౌతులు The Four Horsemen are Still Going Forth



ఆయా సమయ సందర్భాలతో పనిలేకుండా దేవుడు సమస్త ప్రపంచమునకు బాధ్యత వహిస్తున్నాడు. అది ఒక వ్యక్తి జీవితమైన లేదా ప్రపంచదేశాల పోకడలు లేదా ఆలోచనలైనా అన్నిటిమీద చివరకు తన చిత్తాన్నే దేవుడు జరిగిస్తాడు. ప్రజలు పశ్చాత్తపపడుటకు దేవుడు ఈ భూమి మీదకు తన తీర్పులను పంపించనున్నాడని ప్రకటనగ్రంథం మనకు జ్ఞాపకం చేస్తున్నది. ఆతీర్పులువచ్చుట ప్రజలు చూస్తున్నప్పుడు వారికి అంత్యదినం తప్పనిసరిగా గుర్తుకురాగలదు. ఎవడును నశింపక అందరు మారుమనస్సు పొందుకొని దేవుని సత్యమును గూర్చిన జ్ఞానమును పొందుకొనవలెనని దేవుని ఉద్ధేశ్యమైయున్నది. యోహాను దర్శనంలోని "ఏడు తెగుళ్ళను" మనం గమనించి నప్పుడు అవే చివరివి అని గ్రహించగలం. ప్రకటన 15:1. కాని ఆ తెగుళ్ళకు మానవుల ప్రతిస్పందనకూడా మనం 16:9లో చూడగలం. "దేవుని నామమును దూషించిరిగాని, ఆయనను మహిమ పరచునట్లు వారు మారుమనస్సు పొందినవారుకారు." ప్రకటన 16:11 "తమకు కలిగిన వేదనలను బట్టియు పుండ్లను బట్టియు

పరలోకమందున్న దేవుని దూషించిరిగాని తమ క్రియలను మాని మారుమనస్సు పొందినవారు కారు.” పరలోక దేవునిగా ఆయనకు సర్వలోకమును తన ఆలోచన చొప్పున తన ఇష్టానుసారంగా పరిపాలించు అధికారం దేవునికి కలదు.

ప్రకటన ఆరవ అధ్యాయంలో మొదటి గుఱ్ఱం ముందుకు వెళుతూ ఉన్నది. 6:1-2 సువార్త యొక్క శాశ్వతజీవం అనే ఆశీర్వాదం ఇది తెలియ జేస్తున్నది. భూమి యొక్క నాలుగుదిక్కులకు ఈ గుఱ్ఱం వెళ్తుండగా ఇది సర్వమానవాళికొరకైన దేవుని నీతిని సూచించు చున్నది. తీర్పుల వివరణలో మొదటిగా ఈ గుఱ్ఱంను దేవుడు పంపించుట అనునది తగినటువంటిది. “మరియు అ రాజ్యసువార్త సకల జనములకు సాక్ష్యార్థమై లోకమందంతటను ప్రకటింపబడును, అటుతరువాత అంతము వచ్చును.” మత్తయి 24:14 “..సమస్త జనములలో ఆయనపేరిట మారుమనస్సు పాపక్షమాపణయు ప్రకటింపబడుననియు వ్రాయబడియున్నది.” లూకా 24:47.

తెల్లగుఱ్ఱం ముందుకు వెళ్తున్న సమయంలో దాని తరువాత ఒకదాని వెంట ఒకటిగా మిగతా మూడు గుఱ్ఱాలుకూడా అనుసరిస్తున్నాయి. ప్రకటన 6:3-8. దేవుని తీర్పులు ఆయన పరిపాలనలో ఆయన నియమించినట్లుగా ప్రజలమీద పడబోతున్నాయి. ఇదే విషయాన్ని మన ప్రభువు మత్తయి 24:6-7లొ బోధించాడు. “మరియు మీరు యుద్ధములను గూర్చియు యుద్ధ సమాచారములను గూర్చియు వినబోదురు, మీరు కలవరపడకుండా చూచుకొనుడి. ఇవి జరుగవలసియున్నవిగాని అంతము వెంటనే రాదు.”

## ఆధునిక ఉదాహరణలు Modern Examples


LATE GENERAL SANI ABACHA (1943 - 1998)


General Olusegun Obasanjo

మేము నైజీరియాల కొంతకాలం నివసించాము. అప్పుడు అది ప్రధానంగా సైనికపరిపాలన క్రిందఉంది. పౌరులందరు అవినీతిపరులుగా తిరుగుబాటుదారులుగా మారినప్పుడు తిరిగి నైజీరియా సైన్యం తమ డోడన్ సైనిక గుడారాలనుండి బయటకు వచ్చి పరిస్థితిని తిరిగి అదుపులోనికి తీసుకొని వచ్చేది. ప్రజల చేత ఎన్నుకొనబడిన ప్రజాప్రతినిధులు అక్కడ లేకపోతే ఇప్పటికి ప్రభుత్వ పాలన అక్కడ ఇలాగే ఉంటుంది. కొంతమంది సైనికాధికారులు తమపరిపాలనలో పౌరులకంటే మెరుగుగా ఉన్నారు. కాని సైనికాధికారి శాని అబకా ఇటువంటివాడు కాడు. ఇతడు తీవ్రమైన మరియు క్రూరమైనవాడు. జనరల్ అబకాకు వ్యతిరేకంగా ఉన్న శత్రువులుగాని అతనిని విమర్శించేవారు గాని ఉంటే వారిని తొలగించేవాడు మరియు తన వ్యతిరేకులను వీధులలోనే అదృశ్యం చేసేవాడు. అటువంటి జనరల్ అబాకా క్రూరమైన పాలన మీద తిరుగుబాటు చేశాడు జనరల్స్‌లో ఒకడుగా ఉన్న జనరల్ ఒబసాంజో. ఎక్కువకాలం గ॑డువకముందే జనరల్ ఒబసాంజో నిర్భంధంలోనికి తీసుకొనబడి మరణతీర్పును ఎదుర్కొన్నాడు. కాని ఆ తరువాత జనరల్ అబాకా పరిస్థితి రాజైన బెల్షాజర్ మాదిరిగా మారింది. ఒక రోజు రాత్రి జనరల్ అబాకా తన అందమైన రాజభవనంలో తన అంగరక్షకులు తనకు పహారా కాస్తుండగా తాను తన భార్యలతో సంతోషంగా విశ్రాంతి తీసుకుంటుండగా అతడు మరణించాడు. దేవుడు అతని ప్రాణం తీసుకొన్నాడు అతరువాత జనరల్ ఒబసాంజో రక్షించబడి విడుదల చేయబడ్డాడు. జనరల్ ఒబసాంజో మరణతీర్పులోనికి వచ్చుటకు సహాయబడిన వారు తిరిగి అతనిని దించివేయుటకు వారికి మనస్సు రాలేదు. చెరసాలలో ఉండగా జనరల్ ఒబసాంజో మారుమనస్సుపొంది దేవునికి అంకితమైన క్రైస్తవుడుగా మారినాడు. ఆతదుపరి అధ్యక్షఎన్నికలలో జనరల్ ఒబసాంజో రాబోయేఅధ్యక్షపదవికి పోటిచేసి దానికిప్రచారంచేసి గెలిచి నైజీరియా అధ్యక్షుడైనాడు. రాజ్యాంగంలో ఉన్న నిబంధనల ౹ ప్రకారం రెండు పర్యాయాలు అతడు నైజీరియా అధ్యకునిగా బాధ్యతలు నిర్వహించాడు. ఈ ఉదాహరణను బట్టి మన దేవుని అద్భుతమైన సంకల్ప పరిపాలన ఏలాంటిదో మనం గ్రహించగలం. ఈసందర్భంలో జనరల్ ఒబసాంజో హృదయంలో దేవుడు ఉండి కృపతోకూడిన పరిపాలనను కొనసాగించాడు.




19 మరియు 20వ మధ్య శతాబ్ద ప్రారంభంలో చైనాలో క్రైస్తవ మిషన్ల అభివృద్ధి జరిగింది. దానికి వ్యతిరేకంగా భయంకరమైన యుద్ధాలు, తిరుగుబాట్లు, హత్యలు మొదలనైవి జరుగుచున్నా సువార్త పురోగమిస్తున్నది. 20వ శతాబ్ధం అభివృద్ధి చెందుచుండగా కొమిటాంగ్ జాతి నాయకుడైన జనరల్ చియంగ్ కై షేక్ ఒక క్రైస్తవురాలిని వివాహమాడి తన భార్య మతమైన క్రైస్తవ్యానికి రక్షకునిగా ఉన్నాడు. జపనీస్‌వారు ఓడింపబడిన తరువాత తన విరోధులుగా మావో సే టూంగ్ క్రింద కమ్యునిష్టులు బయలుదేరారు. 1949లో గొప్ప విపత్తు జరిగి కమ్యునిష్టులు విజయం సాధించారు. చైనా ప్రధాన భూభాగాన్ని ఆక్రమించగా కొమిటాంగ్ జాతివారు బహిష్కరించబడి ఫార్మోసా దీవిలోనికి పారద్రోలబడ్డారు. గతంలో క్రైస్తవ్యం చైనాలో అనుమతించబడ్డా, ఇప్పుడు అది నిషేధించబడినది. మిషనరీలు

బహిష్కరింపబడ్డారు మరియు మూడు విధాలైన దేశభక్తి ఉద్యమం క్రింద ప్రభుత్వ పరిపాలనలో క్రైస్తవ సంఘం భయంకరమైన వేధింపులకు గురైనది. క్రైస్తవ్యానికి ద్వారాలు మూయబడి, చాలా సంవత్సరాలు అసలు చైనా లోపల ఏమి జరుగుచున్నదో అర్థంకాక చైనా బయటున్న క్రైస్తవులు అయోమయానికి గురైనారు. అయితే ఇంత వ్యతిరేకతలో కూడా దేవుడు తనపరిపాలనను కొనసాగించాడు. 1949 సం॥లో దాదాపుగా 10లక్షలమంది ప్రొటెస్టంట్ క్రైస్తవులు చైనాలో ఉన్నారు. మరిఇప్పుడు లెక్క చూస్తే చైనాలో దాదాపుగా 10కోట్లమంది క్రైస్తవులుఉన్నట్లుగా అంచనా. దేవుని కృపాపాలనలో వాక్యం వేగంగా విస్తరిస్తు గొప్ప విజయాలను సాధించుచున్నది.



చైనాలో ఉన్న పరిస్థితిని ఇంకా కొంచెం లోతుగా మనం పరిశీలన చేస్తే, 120 కోట్ల జనాభా ఉన్న చైనాలో దేవుడు తన తన మార్గాలలో అనేక రీతులుగా క్రైస్తవ్యాన్ని అభివృద్ధి చేస్తున్నాడు. ఇది మనయొక్క జ్ఞానానికి అందనటువంటి విషయం.

చైనాలోని కమ్యునిష్టు పరిపాలనా నిర్మాణానికి తోడ్పడిన కొందరు చైనా నాయకులకు ఐరోపా మరియు అమెరికా వంటి దేశాలు సుదీర్ఘ మరియు నిరంతర ఆర్థిక అభివృద్ధిని ఎలా సాధించాయో తెలియక తికమక పడ్డారు. అతరువాత దీనిగురించి వారుఅధ్యయనం జరిగించగా దొరికిన సమాధానం వారిని ఆశ్చర్యపోయేలా చేసింది. దానికి కారణం క్రైస్తవ్యం. పశ్చిమ దేశాలలో క్రైస్తవమత వ్యాప్తి కారణంగానే అనేక పారిశ్రామికవేత్తలు ప్రభావితులై ఆ దేశాల వైపు ఆకర్షింపబడ్డారు. దానిఫలితమే ఆ దేశాలు సాధించిన సుదీర్ఘ మరియు స్థిరమైన ఆర్థిక అభివృద్ధి. ఇక్కడ చైనాలో మళ్ళీ దేవుడు తన కార్యాన్ని చేశాడు. ఆయన తన పరిపాలన ఏవిధంగా కొనసాగిస్తాడో మానవుల మైన మన ఊహకు మరియు జ్ఞానమునకు అందనిది. ఇప్పుడు చైనాను గమనిస్తే అనేక ప్రదేశాలలో క్రైస్తవుల యెడల ఒకప్పుడున్న హింస ఇప్పుడు లేదు. కొన్నికొన్ని మారుమూల ప్రాంతాలలో హింస తీవ్రంగా ఉన్నా, చైనాలో క్రైస్తవ మతం గురించి అందరుఒక ఆశావహ దృక్పథంలో ఉన్నారు.




చైనా అంచులలోని కొన్నికొన్ని గిరిజన అల్పసంఖ్యాకులు ఉన్నప్రాంతాలను మనం దర్శిస్తే, మతసహనం అనేదిఅక్కడ ఇప్పుడు స్పష్టంగా కనబడుచున్నది. నేను ఒకసారి చైనాలో పనిచేసి థాయ్‌లాండ్‌కు తిరిగి వస్తున్న ఒక మిషనరీని కలిసి మాట్లాడాను. . అతను చైనాలో ఒక బైబిల్ సెమినరీ ప్రారంభోత్సవానికి వెళ్ళి వస్తున్నాడట. ఒకప్పుడు సెమినరీని సహించలేని చైనా దానికి అనుమతి ఇవ్వలేదు కాని ఇప్పుడు సెమినరీకి అనుమతి ఇచ్చారు. దేవుని కార్యాలు ఎంత అద్భుతం.

## ముగింపు Conclusion

రాజులకు రాజు మరియు ప్రభువులకు ప్రభువును అయిన ఆ దేవుని మనం ఎప్పుడు తక్కువ అంచనా వేయకూడదు. భూదిగంతాలు దాటి ఆయన పరిపాలన కొనసాగుచున్నది. ఆయన ఇప్పుడు సంపూర్ణ బాధ్యత వహించి పరిపాలన కొనసాగిస్తుండగా ఆయన యెడల మన విశ్వాసాన్ని ఎప్పుడు తొట్రుపాటు పడనివ్వరాదు. నేను నిన్ను విడువను ఎన్నడు నిన్ను ఎడబాయను అను ఆయన యొక్క అద్భుత వాగ్దానం మనకు ఉన్నది. ఈ వాగ్దానంద్వారా దేవుడు సంఘంలోను మరియు సంఘం వెలుపల కూడా తన కార్యకలాపాలను అమలు చేస్తుంటాడు. తనఆసక్తిని బట్టి కార్యములను జరిగించి తద్వారా మనకు అంతిమ ప్రయోజనంకలిగిస్తాడు. దేవుని చేత పరిపాలించ బడుతున్న ఆయన సంఘం ఎప్పుడు విశ్వాసం ద్వారా మంచి పోరాటాన్ని పోరాడే తత్వాన్ని కల్గి ఉండాలి. సంఘం ఎప్పుడు విజయాన్ని సాధించే విధంగా ఆయన తనపరిపాలనను కొనసాగిస్తున్నాడు. తదుపరి ఆయనతోనున్న సమస్త ఆత్మలు పరదైసులో దేవదూతలతో కలిసి ఉండగలవు. ఇప్పుడు ఆయన యొక్క అధికారంతో ఆయన రాజ్యపాలన భూమియందంతటా కొనసాగుచున్నది. ఆయన సమస్తాన్ని సృష్టించాడు కాబట్టి ఆయన పరిపాలించుచున్నాడు. దేవుని నామానికే స్తోత్రం కలుగును గాక అమెన్!




రెవ. డేవిడ్ కీని

**Rev. David Koenig**

CLCI BIBLE INSTITUTE NIDUBROLU